

19న చిత్తూరుకు చంద్రబాబు రాక

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 19వ తేదీ చిత్తూరు పార్లమెంట్ పరిధిలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలుగుదేశం నాయకులు తెలిపారు. స్థానిక టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంఎల్‌సి దొరబాబు నాయకులు గురజాల చెన్నకేశవ నాయుడు, చంద్రప్రకాష్‌లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం గాలి విస్తోందన్నారు. రానున్న ఎన్నికలలో తెలుగుదేశం ఘనవిజయం సాధించడం ఖాయమన్నారు. చిత్తూరు పార్లమెంట్ పరిధిలో ఈనెల 19వ తేదీ నిర్వహించే సభాస్థలం త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈసందర్భంగా జయహో బిసి ప్రచార రథలను ప్రాంరంభించారు.

'ఎస్మా'కు భయపడం

కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీల నిరవధిక దీక్షలు



అంగన్వాడీల పోరాటానికి మద్దతు తెలుపుతున్న సిఐటియు, టిడిపి నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జీతాలు పెంపు, గ్రాట్యూటీ అమలు విషయంలో తగ్గేదేలే... అంటూ పోరాడుతున్న అంగన్వాడీలు తమ పోరాటాన్ని ఉధృతం చేస్తూ చిత్తూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట శనివారం నిరవధిక దీక్షలకు పూనుకున్నారు. ప్రభుత్వం తమ ప్రధాన డిమాండ్ల విషయంలో స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు సమ్మె కొనసాగుతుందని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షకిల స్పష్టం చేశారు. హక్కుల కోసం పోరాడుతున్న అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం ఎంత వరకు సమజసమని, ఎస్మాలకు భయపడేది లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్కీమ్ వర్కర్స్ అయిన అంగన్వాడీలకు ఎస్మా వర్తించదన్నారు. పాదయాత్ర సందర్భంగా నేటి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరితే ఎస్మా చట్టం ద్వారా అణచివేసే ప్రయత్నం చేస్తోందన్నారు. సుదీర్ఘ పోరాట అనుభవం ఉన్న అంగన్వాడీల సత్తాను ప్రభుత్వం తక్కువ అంచనా వస్తోందని తీరు మార్చుకోకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అంగన్వాడీల పోరాటానికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నరసింహరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మద్దతు ప్రకటించారు. అంగన్వాడీలపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోందని ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సుప్రీం కోర్టు తీర్పులను అమలు చేయమని కోరడం నేరమా అని ప్రశ్నించారు. ఎస్మాలకు భయపడే స్థితి లేదన్నారు. ఇచ్చిన మాట తప్పిన జగన్ ప్రభుత్వాని ఇంటికి పంపే రోజులు దగ్గరపడ్డాయన్నారు. అంగన్వాడీల పోరాటానికి తెలుగుదేశం నేతలు మాజీ ఎంఎల్‌సీ దొరబాబు నాయకులు చంద్రప్రకాష్, సప్తగిరి ప్రసాద్, మోహన్‌రాజ్‌లు మద్దతు తెలిపారు. బట్టన్లు నొక్కి ప్రజల చెవిలో పువ్వులు పెట్టిన జగన్‌ను ఇంటికి పంపేలా మూడు నెలల తరువాత బలంగా బటన్ నొక్కి ఇంటికి పంపాలన్నారు. అంగన్వాడీల పోరాటం న్యాయమైనదని టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీల జీతాల పెంపు, గ్రాట్యూటీ అమలు ఇతర సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు సృజని, ప్రభావతి, జ్యోతి, చిత్తూరు ప్రాజెక్టులోని గుడిపాల, చిత్తూరు రూరల్, అర్బన్ అంగన్వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమ్మెపై ఎస్మా వెంటనే ఉపసంహరించుకోవాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

అంగన్వాడీల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగిస్తూ జీవో నెంబర్ 2 తీసుకురావడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తీవ్రంగా ఖండిస్తూ వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 26రోజులు శాంతియుతంగా పోరాటం చేస్తున్న అంగన్వాడీల సమ్మెపై ఎస్మాను చట్టపరిధిలోకి తీసుకురావడం సమ్మెను నిషేధించడం అప్రజాస్వామ్యమని ధ్వజమెత్తారు. సమస్యలను పరిష్కారం చేయకుండా సమ్మె చేయకుండా నిషేధించడం వేతనాల్లో కోత విధిస్తామని చెప్పడమే అన్నారు. న్యాయబద్ధమైన సమ్మెను అక్రమ మార్గంలో సమ్మెను విచ్ఛిన్నం చేయడం అభ్యంతరకరమన్నారు. ఇదే పద్ధతి కొనసాగిస్తే రాష్ట్రవ్యాప్తంగా జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ప్రభుత్వం నిరంకుశ వైఖరిని అన్ని కార్మిక సంఘాలు ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండించి, కలిసి రావాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీల సమస్య పరిష్కారమయేంత వరకు ప్రత్యక్షంగా సిపిఎం మద్దతు తెలియజేస్తుందని పిలుపునిచ్చారు.

పుంగనూరు: రాష్ట్రంలో వైయస్సార్ ప్రభుత్వానికి అంగన్వాడీలు చేస్తున్న న్యాయమైన సమస్యల కోసం చేపట్టిన పోరాటం పట్టదా అంటూ అంగన్వాడీలు ప్రశ్నించారు. పుంగనూరు రూరల్ రాంపల్లి సమీపంలో ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీల జీతాలు పెంచుతామని హామీ ఇచ్చి తీరా గెలిచిన తర్వాత మమ్మల్ని పట్టించుకోకపోవడం ఎంత వరకు సమజసమని ప్రశ్నించారు. అంగన్వాడీ రత్నమ్మ, సునంద, ఉమా పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ఎస్ఎస్ఏ ఉద్యోగుల పోరాటానికి మద్దతు తెలియజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు నరసింహరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేస్తున్న ఎస్-ఎస్ఏ ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నరసింహరావు మాట్లాడుతూ ఛలో విజయవాడ నిర్వహించిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. న్యాయమైన తమ డిమాండ్ల పట్ల పోరాడుతున్న ఉద్యోగులను అరెస్టు చేయడం నిర్బంధించడం వంటి చర్యలకు పూనుకోవడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు ఎస్ఎస్ఏ ఉద్యోగులు పోరాటాన్ని కొనసాగించాలన్నారు. వీరి పోరాటానికి సిఐటియు రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల పోరాటానికి టిడిపి నాయకులు దొరబాబు, చంద్రప్రకాష్, మోహన్‌రాజ్, సప్తగిరి ప్రసాద్ మద్దతు ప్రకటించారు.

హాస్టల్ విద్యార్థులకు ప్రేరణా తరగతులు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి పరిధిలోని 10వ తరగతి విద్యార్థులు, పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించుటకు, నిష్ణాతులచే శనివారం స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఇంగ్లీష్ - జయ కుమార్, గణితం - అరుణ్ శివప్రసాద్, భౌతికశాస్త్రం - నౌషాద్ బాషా, జీవశాస్త్రం -మురళి, మనోవిజ్ఞానం- గుణ శేఖర్ బోధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి సంక్షేమ, సాధికారిత అధికారి రాజ్యలక్ష్మి పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో ఉన్నత చదువులు చదివి, గొప్పస్థాయికి చేరాలని కోరారు. విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందచేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, ఎస్‌డబ్ల్యూఓలు శ్రీకాంత్, ఏకాంబరం, మురళి,సులోచన, అన్నపూర్ణ, త్రివేణి,ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఒంటి కాలిపై పారిశుధ్య కార్మికుల నిరసన



ఒంటి కాలిపై నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కనీస వేతనాల కోసం సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు శనివారం ఒంటి కాలిపై నిలబడి ప్రభుత్వతీరుపై నిరసన వ్యక్తం చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట పారిశుధ్య కార్మికులు సమ్మెను కొనసాగించారు. ఈసందర్భంగా యూనియన్ నేతలు వాసు, జయశంకర్, సురేష్ మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రపోతూ మున్సిపల్, అంగన్వాడీ, సమగ్రశిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సమస్యలను పరిష్కరించకుండా మొద్దునిద్ర పోతున్నట్టు నటిస్తూ కార్మిక, ఉద్యోగవర్గాన్ని దగా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కరోనా వైరస్ ప్రబలతున్న సందర్భంలో ఐదుకోట్ల మంది ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ అనారోగ్య భారీ పడకుండా సేవలందిస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధిచెబుతారని హెచ్చరించారు. నాయకులు వినాయక, సుగుణ, ఈశ్వర్, రమణి, చిత్ర, సుబ్రహ్మణ్యం, సుభాషిని, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం యూనియన్ నాయకులు శరవణ, వెంకటేష్, జయప్రకాష్, లక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికలు సక్రమంగా నిర్వహించే బాధ్యత సెక్టోరియల్ అధికారులదే..

జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్



అధికారులతో మాట్లాడుతున్న డిఆర్‌ఓ రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరు: ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు సెక్టోరియల్ అధికారులు అత్యంత బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.రాజశేఖర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఆర్డీవోలు, మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సెక్టోరియల్ అధికారుల విధులు వారికి శిక్షణ ఇచ్చే విధానంపై డిఆర్‌ఓ మాట్లాడుతూ ఈనెల 9, 10 తేదీలలో రాష్ట్రస్థాయిలో కేంద్ర ఎన్నికల అధికారుల సమావేశం ఉంటుందని ఆ తర్వాత 22న ఓటర్లజాబితా విడుదల చేయడం జరుగుతుందని సెక్టోరియల్ అధికారులు, బిఎల్‌ఓలు ఎన్నికల నియయావళికి సంబంధించి పలు చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు సంబంధించి క్షేత్రస్థాయిలో బిఎల్‌ఓలపాత్ర అత్యంత ప్రధానమైనదని, రానున్న కాలంలో పోలింగ్ కేంద్రాలలో కావాల్సిన మౌలిక వసతుల విషయంలో నివేదికలు చాలా అవసరమని, అదేవిధంగా సెక్టోరియల్ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలను మ్యాపింగ్ చేసుకొని కమ్యూనికేషన్ వ్యవస్థ, పోలీసులతో కలిసి శాంతి భద్రతలు, ఆసుపత్రి సౌకర్యం, మొబైల్ ఇంటర్నెట్ పనికి పరిశీలించుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాలు ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ప్రత్యేక భద్రత కోసంపై అధికారులకు నివేదికలను సమర్పించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఈవీఎంల పట్ల అవగాహన ఇవ్వడం జరుగుతుందని మరింతగా పోలింగ్ నమోదు అయ్యేందుకు అవగాహన కార్యక్రమాలు విస్తతపరచాలని సూచించారు. ఓటరు స్లిప్పులు అందకుంటే పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్‌ఓ ఉండేటట్లు చూడాలన్నారు. ఈవీఎంలు పోలింగ్ కేంద్రానికి వచ్చిన తర్వాత ఈవీఎం వారు సూచించిన విధంగా కనెక్ట్ చేసుకొని పోలింగ్‌కు ముందుగా పరిశీలించుకోవాలని తెలిపారు. అదేవిధంగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఇవ్వాల్సిన నివేదికలను సకాలంలో ఇచ్చేటట్లు చూడాలన్నారు. నగరి ఆర్డీఓ సజన, చిత్తూరు ఏఎస్ఓ సుందర్ రాజన్‌లు శిక్షణ ఇవ్వగా పలమనేరు ఆర్డీఓ మనోజ్ కుమార్‌రెడ్డి, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు, ఎన్నికల సిబ్బంది, మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

రాజకీయ వే'ఢీ'

ప్రజా'దృష్టి'





ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

వాతావరణం చల్లగా ఉన్న అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో జిల్లాలో రాజకీయ వేడి రాచుకుంటోంది. అధికార ప్రతిపక్ష పార్టీలో సీట్ల గంధరగోళం నెలకొంది. అధికార వైసిపి, ప్రతిక్ష టిడిపి 2024 సాధారణ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో అభ్యర్థుల ఎంపిక విషయంలో ఆచీతూచి అడుగులు వేస్తున్నాయి. అధికారపార్టీ నిర్వహించిన ఐప్యాక్ సర్వే అనుకూలంగా లేదంటూ పూతలపట్టు, చిత్తూరు సిట్టింగ్ ఎంఎల్ఏల స్థానంలో కొత్తవారి అవకాశం ఇవ్వనున్నట్ల పార్టీ అధినేత స్పష్టం చేయడంతో టికెట్లు దక్కని నేతలు పార్టీ, అగ్రనేతలపై విమర్శనాస్త్రాలు స్పందిస్తున్నారు.

పూతలపట్టు ఎంఎల్ఏ ఎంఎస్ బాబు ప్రెస్‌మీట్ పెట్టి మరీ దళితులకు అన్యాయం జరుగుతోందని బహిరంగంగా విమర్శించారు. ఐప్యాక్ సర్వే బూటకమని డబ్బులిచ్చే వారికి అనుకూలంగా ఉంటోందన్నారు. నేతల ఆదేశాల మేరకు నడుకున్నానంటూ తనకు వ్యతిరేకంగా సర్వే రావడం స్వయంగా సిఎం తనకు సీటు లేదని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులుకు మరోమారు ఎంఎల్ఏ సీటు వచ్చే అవకాశాలు లేకపోవడంతో బహిరంగ కార్యక్రమాలకు స్వస్తి చెప్పారు. చిత్తూరు నియోజవర్గ బాధ్యతలు స్వీరించిన ఎంసి విజయనాందరెడ్డి జనంలో విస్తృతంగా పర్యటిస్తూ తనకే సీటు ఖాయమంటూ బహిరంగంగా ప్రకటిస్తూ చిత్తూరు నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో అధికార, ప్రతిక్ష పార్టీలు ప్రజాసంఘాలు, కులసంఘాల కమిటీలను ఏర్పాటు చేస్తూ నాయకత్వాన్ని ప్రకటిసున్నాయి. చిత్తూరు నియోజవర్గంలో 25 నుంచి 30వేల ఓట్లు ఉన్నాయంటూ తమకుల అభ్యర్థికే సీటు కేటాయించాలంటూ బలిజ సంఘం నేతలు సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించారు. మొదిలియార్ కులస్తులు పోటాపోటీ సమావేశాలు నిర్వహించాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చిత్తూరు అసెంబ్లీ స్థానాన్ని ఆశిస్తున్న అధికార ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల ఫ్లెక్సీలు, కటౌట్లుతో నిండిపోయింది. అంతర్గాత సమీకరణలో బిజిబిజీగా గడిపేస్తున్నారు. ఈనెల 19వ తేదీ చిత్తూరు పార్లమెంట్ పరిధిలో తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జయహో బిసి గర్జనసభ నిర్వహించనున్నారు. సంక్రాంతి తరువాత ముందే వైసిపి జగన్ మోహన్‌రెడ్డి సభను జిల్లా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇలా జిల్లాలో ఎన్నిక వేడి రాజేస్తుంకుటోంది.

తిరుపతి అభివృద్ధిని అడ్డుకోవడం వెనుక..
బిజెపి 'కమీషన్ల' నాటకం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

సనాతన ధర్మం పేరుతో స్త్రీలను వంటింటి కుందేళ్లుగా మార్చాలని కుట్ర చేస్తున్న బిజెపి, ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో సైతం అబివృద్ధికి మోకాళ్ల అడ్డుకుంటోంది. కొంత మంది నాయకులు స్వార్థంతో కమీషన్ల కోసం కోర్టు కేసులు వేస్తున్నారన్న విమర్శలున్నాయి.

'భారతదేశం దేవుళ్లకు పుట్టినిల్లు. దేశం మొత్తం హిందువులదే. ప్రతి గుడిని పవిత్రంగా చూద్దాం. భక్తుల సకల సౌకర్యాల కల్పనకు కృషి చేద్దాం. సనాతన ధర్మాన్ని కాపాడుదాం' అంటూ నిత్యం వల్లెవేసే భారతీయజనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేవుడి పేరుతో ఇతర మతాలపై దాడులు చేయడం నిత్యకృత్యంగా ఉంది. తిరుపతి నాయకులు మరో అడుగు ముందుకేశారు. నిత్యం తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి పేరు వల్లిస్తూనే, ఆయన్ని అడ్డం పెట్టుకుని కోట్లు దోచేస్తున్నారు. మరికొంత మంది ఆయన భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు పూనుకున్నా, భక్తుల సౌకర్యార్థం నగరాభివృద్ధిని చేయాలన్న తీర్మానానికి మోకాలడ్డి, కమీషన్ల కోసం కోర్టు కేసులు వేస్తున్నారని ప్రజలే బహిరంగంగా విమర్శలు చేస్తుండటం గమనార్హం. విస్తరిస్తున్న తిరుపతి అబివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, పెరుగుతున్న శ్రీవారి భక్తుల రాకపోకలకు అనుగుణంగా నగరాభివృద్ధికి సహకరించాలని తిరుపతి కార్పొరేషన్ అధికారులు టిటిడికి మొరపెట్టుకున్నారు. అందుకు పాలకమండలిలో చర్చించి, టిటిడి బడ్జెట్‌లో ఒక శాతం నిధులను తిరుపతి అబివృద్ధికి కేటాయించాలని నిర్ణయించారు. అందుకు చర్యలు సైతం తీసుకున్నారు. కానీ తిరుపతి అబివృద్ధి, భక్తుల సౌకర్యాలు ఏమాత్రం నచ్చని బిజెపి నాయకులు దీన్ని వ్యతిరేకిస్తూ సాక్షాత్తు రాష్ట్ర హైకోర్టులో కేసులు వేశారు. టిటిడి బోర్డులో సాక్షాత్తు నలుగురు బిజెపి పార్టీకి చెందిన సభ్యులే ఉన్నారు. వారు కూడా నిధుల విడుదలకు అంగీకరించారు. కానీ స్థానిక నాయకులు, అది కూడా గతంలో పాలమండలి సభ్యులుగా పని చేసిన వ్యక్తే దీన్ని అడ్డుకోవడం శోచనీయమని తిరుపతి ప్రజలు విమర్శిస్తున్నారు. గతంలో ఆయన పాలకమండలి సభ్యులుగా ఉన్నప్పుడు ప్రతి రోజూ ఉదయం 3 గంటలకే శ్రీవారి ఆలయం వద్ద ప్రత్యక్షమయ్యేవారు. స్వామిపై భక్తిపేరుతో కార్పొరేట్ వ్యక్తులకు దర్శనాలు కల్పిస్తూ దళారీగా మారిన విషయాన్ని మరిచిపోయారా అంటూ బిజెపికి మద్దతు ఇచ్చే రాజకీయ పార్టీ నాయకులే విమర్శలు గుప్పిస్తున్నారు. బిజెపికి ఇది తొలి కాదు గతంలో టిటిడి ఉద్యోగులకు ఇళ్ల స్థలాల విషయంలోనూ కోర్టు కెళ్లింది. శ్రీనివాస సేతు (గరుడ వారధి) నిర్మాణంలో తమకు కమీషన్లు ఇవ్వలేదని, శ్రీవారి నామాలు రోడ్లపై వేస్తారా అంటూ హైకోర్టు తలుపు తట్టింది. కోర్టు మొట్టికాయలు వేయడం, స్థానిక ప్రజల ఆగ్రహానికి గురికావడంతో వెనక్కి తగ్గారు. ఎన్నికల వేళ ఇలా దేవుడిని సైతం రాజకీయాల్లోకి లాగడాన్ని స్థానికులే వ్యతిరేకిస్తూ, ఆగ్రహాన్ని వెలగక్కుతున్నారు. పార్టీలు, కమీషన్ల కథ దేవుడెరుగు, మొదట స్థానికులు అనే విషయాన్ని వారు గుర్తు పెట్టుకుని, తమ ఊరు అబివృద్ధికి సహకరించాలని, పలు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు హెచ్చరించాయి. కులాలు, మతాలు, ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా తిరుపతి నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించి, నగరాన్ని ఆదర్శంగా నిలపాలని మేధావులు హితవు పలుకుతున్నారు.

సంక్రాంతికి 'స్పెషల్'

233పైగా అదనపు బస్సులు
'ప్రత్యేక'ం పేరుతో జేబుకు చిల్లు



ప్రజాశక్తి-తిరుపతి సిటి

సంక్రాంతి పండుగ, సెలవులను దృష్టిలో ఉంచుకుని ఏపిఎస్ ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది. జిల్లా నుంచి సుదూర ప్రాంతాలకు 233 పైగా స్పెషల్ బస్సులను నడపనుంది. కానీ స్పెషల్ పేరుతో ప్రయాణీకుల నుంచి భారీ స్థాయిలో ఛార్జీలను వసూళ్లు చేయనుంది. దీంతో పండగకు సొంతూర్లకు వచ్చే వారికి ప్రయాణంలోనే జేబులకు చిల్లులు పడేలా ఉండడం గమనార్హం.

సంక్రాంతి పండుగ. తెలుగువారికి అత్యంత ప్రముఖమైన పండుగ. బోగి, సంక్రాంతి, కనుమ, పశువుల పండుగ వరుసగా నాలుగు రోజుల పాటు జరుపుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి పండుగ అంటే అందరికీ మక్కువ. అందుకు కారణం లేకపోలేదు. ఎక్కడో సుదూర ప్రాంతాల్లో బతుకు దెరువు కోసం జీవిస్తున్న వారు సంక్రాంతి (పెద్ద పండుగ)కి సొంతూర్లకు వస్తుంటారు. కొత్త అల్లుళ్ళు, కోడళ్లు, అత్తలు, మామలు, మరదలు, బామార్దులు, అన్నదమ్ములు, అక్కచెల్లెలు అందరూ ఒక చోట చేరి పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా పండుగకు రెండు రోజుల ముందే దూర ప్రాంతాల్లో, పట్టణాల్లో, నగరాల్లో నివసించే వారు వారి గ్రామాలకు వస్తుంటారు. దీంతో బస్సుల్లో, రైళ్లలో రద్దీ అధికంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏపిఎస్ ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులను సైతం నడుపుతోంది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 11 డిపోల ద్వారా మద్రాసు, కోయంబత్తూరు, బెంగుళూరు, మైసూరు, హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్టణం, అనంతపురం, కర్నూలు, రాజమండ్రి, తదితర ప్రాంతాలకు సుమారు 233కిపైగా ప్రత్యేక సర్వీసులను నడపనున్నారు. ప్రత్యేక సర్వీసులు ఇవ్వడం ద్వారా ప్రయాణీకుల రద్దీకి తగ్గట్టు బస్సులను నడిపి వారికి రవాణా సౌకర్యం కల్పిస్తూనే, ఆదాయాన్ని కూడా సమకూర్చుకోవడం పరిపాటే. కానీ ఆర్‌టిసి అధికారులు మరో అడుగు ముందుకేసి, ప్రత్యేక సర్వీసులకు 1.1/2 వంతెన చార్జీలు వసూళ్లు చేయనున్నారు.

బస్సు సర్వీసు	మామూలుగా(స్లీపర్)	ప్రత్యేకం (స్లీపర్)
తిరుపతి-హైదరాబాద్	1400-1800	2100-2500
తిరుపతి-విజయవాడ	స్లీపర్ 980	1380
	సిట్టింగ్ 780	1050

ప్రయాణికులను ఆకర్షించేందుకు 'ప్రయివేట్'

ఆర్‌టిసి బస్సులే కాదు, ప్రయివేట్ సర్వీసులు సైతం రద్దీని దృష్టిలో ఉంచుకుని ధరలు పెంచనున్నాయి. సాధారణంగా తిరుపతి-హైదరాబాదు మధ్య స్లీపర్ రూ.1200 నుంచి 1800 వరకు ధర ఉంది. రద్దీ సమయంలో రూ.1600 నుంచి 2200 వరకు వసూళ్లు చేస్తుంటారు. తిరుపతి-విజయవాడ, తిరుపతి-బెంగుళూరు బస్సుల్లో సైతం ఆర్‌టిసితో పోల్చుకుంటే కొన్ని ప్రయివేట్ సర్వీసుల్లోనే అరాకొర తక్కువ చార్జీలు వసూళ్లు చేస్తుండడం గమనార్హం.

ప్రయాణీకులకు సురక్షితమైన రవాణా, భద్రతతో కూడిన ప్రయాణం, తక్కువ ధరలకు అందించాలనే ఏర్పాటు చేసిన ఏపిఎస్ ఆర్‌టిసి ప్రభుత్వ సంస్థలో ఆదాయమే ధ్యేయంగా ప్రయాణీకుల నుంచి ముక్కుపిండి వసూళ్ల చేసేందుకు పూనుకోవడం శోచనీయం. ఆర్‌టిసి అధికారులు సంక్రాంతి ప్రత్యేక సర్వీసుల్లో అదనపు చార్జీలు వసూళ్లు చేయకుండా చర్యలు తీసుకుని, ప్రయాణీకులకు అవసరాలకు దగ్గ విధంగా సర్వీసులు నడపాలని పలువురు ప్రయాణీకులు కోరుతున్నారు.

'నగర అభివృద్ధిపై నిలదీయండి'

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఓట్ల కోసం వచ్చే నాయకులను చిత్తూరు నగరాన్ని అభివృద్ధిపై నిలదీయాలని చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్మెంట్ సొసైటీ నాయకులు సత్య కోరారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 100ఏళ్ళకు పైగా చరిత్ర కలిగిన చిత్తూరు అభివృద్ధికి పాలకులు కృషి చేయాలని, అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి రావాలన్నారు.

'ఆదిత్య ఎల్-1' విజయంపై హర్షం

ప్రజాశక్తి-యాదమరి: ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించిన ఆదిత్య ఎల్-1 ఉపగ్రహం విజయవంతం కావడంపై పీఏటీయీయూ శాఖ హర్షం వ్యక్తం చేసింది. 127రోజుల్లో 15లక్షల కిలోమీటర్లు ప్రయాణించి సంపూర్ణ విజయం సాధించి ప్రతి భారతీయుడూ సంతోషించేలా చేసిందని రోజని పీఏటీయీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి అన్నారు. శనివారం ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. 5ఏళ్ల పాటు ఆదిత్య ఎల్1 సేవలు అందిస్తుందని ఇస్రో తెలపడం పట్ల ఆనందించాల్సిన విషయం అన్నారు. ఈ శాఖ మహిళా జిల్లా నాయకురాలు హిమబిందు, షహనజ్, మండల నాయకులు శివప్రసాద్, సురేష్ రెడ్డి, ఆనంద్ పిళ్ళై, విశ్వనాథ్, తులసి ప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

'ఫ్యామిలీ డాక్టర్' సేవలు సద్వినియోగించుకోండి

- డాక్టర్ అనిల్‌కుమార్

ప్రజాశక్తి-యాదమరి: గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా చేపడుతున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని జంగాలపల్లెలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వారి ముంగిటకే ఉచిత వైద్య సేవలు తీసుకెళ్లాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రతి నెల మొదటి శనివారం వైద్య బృందం గ్రామాలకు వచ్చి వైద్య సేవలు అందిస్తారని ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 140కాల వైద్య పరీక్షలు చేసి 107రకాల మందులను అవసరాన్ని బట్టి అందిస్తారని, చిన్న చిన్న జబ్బులకు వైద్యులు పరీక్షలు చేసి మందులు అందించడం జరుగుతుందన్నారు. అధిక రక్తపోటు, చక్కర వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా మాత్రలను ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ లక్ష్మీపతి, హెల్త్ అసిస్టెంట్ సురేంద్రనాథ్‌రెడ్డి, మహిళా ఆరోగ్య కార్యకర్త గజలక్ష్మి, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ రవికుమార్ కుటుంబ సభ్యులు శనివారం 3వందల మందికి అన్నదానం చేపట్టారు. ఉదయం స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

ఇంటి స్థలాల కోసం జేసీకి వినతి

ప్రజాశక్తి-రామకుప్పం: రామకుప్పం మేజర్ పంచాయతీలోని మిట్టపల్లి గ్రామంలో పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని జేసీ శ్రీనివాసులుకు జెడ్పీటీసీ నితిన్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. శనివారం చిత్తూరులో జేసీనికి కలిసి సమస్యలపై వివరించారు. తిమ్మసముద్రం గ్రామంలోని సర్వే నెంబర్ 5/1లోని భూమిని సర్వే చేసి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జేసీ మండల తహశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు జెడ్పీటీసీ తెలిపారు. ఆయనతో పాటు సచివాలయ కన్వీనర్ రామిరెడ్డి, వార్డు సభ్యులు సుధామధు, నాయకులు ప్రకాష్, రవి, పవన్, శేషాద్రి పాల్గొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి-సదుం: మండలంలోని రెడ్డివారిపల్లి డాక్టర్ వైఎస్సార్ క్లినిక్‌కు అవసరమైన కుర్చీలను సర్పంచ్ హనుమంతరెడ్డి వితరణ చేశారు. శనివారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కుర్చీలను అందించారు. అనంతరం దృష్టి లోపం ఉన్న వారికి ప్రభుత్వం కంటి అద్దాలు మంజూరు చేసింది. 17మందికి సర్పంచ్ చేతుల మీదుగా అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య అధికారులు ఉదయ్‌భాస్కర్, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

మండల టీడీపీ సమన్వయకర్తగా శివప్రసాద్

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండల టిడిపి సమన్వయ కర్తగా జీడీ నెల్లూరుకు చెందిన శివప్రసాద్‌ను నియమించినట్లు నియోజవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ థామస్ తెలిపారు. శనివారం ఆయనకు నియామక పత్రం అందజేశారు.

సరిహద్దులో నిఘా కట్టుదిట్టం : ఎస్ఈబీ

ప్రజాశక్తి-పుంగనూరు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా అధికారులు కట్టుదిట్టమైన చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం పుంగనూరు మండల సమీపంలోని కర్నాటక రాష్ట్ర సరిహద్దులోని చెక్‌పోస్టును ఎస్ఈబీ ట్రైనీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్ తనిఖీ చేశారు. గతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించి, గత అనుభవాలను అక్కడి అధికారులతో చర్చించారు. మద్యం, నిషేధిత వస్తువులు అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా తయన తెలిపారు. సరిహద్దులపై పూర్తి నిఘా ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం పుంగనూరు ఎస్ఈబీ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సిబ్బంది పనితీరు అక్కడి పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పత్రపల్లె తండా, పెద్ద తండా నల్లగుట్లపల్లి తండాల్లో ఆయన పర్యటించారు. అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తరువాత ఆయన వెంట ఎస్ఈబీ ఇన్స్‌పెక్టర్ సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నగరి: ఎస్టీయూ నగరి మండలశాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో శనివారం ఎస్టీయూ 2024 డైరీ, క్యాలెండర్‌ను ఎంఈవో శ్రీదేవి, నమశ్శివాయం ఆవిష్కరించారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి కలికిరి పవన్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ టి.యం.సుబ్రమణ్యం, పుత్తూరు మండలశాఖ గౌరవాధ్యక్షుడు నాగభూషణం, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, ఆకుల ఊత్తుకోట రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని కొంగనపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రంగారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ఎమ్మెల్సీ భరత్, అఖిలపక్ష నేత లు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘన నివా ళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఎస్టీయూ మండల శాఖ కార్యవర్గాన్ని శనివారం జిల్లా సభ్యులు గంటా మోహన్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, ఆర్థిక కార్యదర్శిగా రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షులుగా జగదీష్,.రామలింగారెడ్డి ఉపాధ్యక్షులుగా అనిత ఏకగ్రీవం ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు దేవరాజు రెడ్డి, మోహన్, మధన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందళ్లు.. సందళ్లే.!

- డైట్‌లో అట్టహాసంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు
- ద్రవిడ వర్సిటీలో ఘనంగా పొంగళ్లు



కార్వేటినగరం డైట్‌లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: పల్లెలకంటే ముందస్తుగానే విద్యాలయాలకు సంక్రాంతి వచ్చింది. తెలుగు సంప్రదాయాలను గుర్తు చేసేలా ఆయా సంస్థల్లో విద్యార్థుల మధ్య సంబరాలు జరిపుతున్నారు. శనివారం సంక్రాంతిని పురస్కరించుకుని ముందస్తుగా సంభరాలను వైభవంగా నిర్వహించారు. ఈ సంధర్బంగా ఛాత్రోపాధ్యాయులు డైట్ ఆవరణాన్ని రంగు రంగుల రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే తెలుగు సంప్రదాయ ప్రకారం భోనాలు ఏర్పాటు చేసి షడ్రుచిలతో కూడిన వంటకాలు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం డీఈవో(తిరుపతి) డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ ఈ సంభరాల్లో పాల్గొని అధ్యాపకులకు ఛాత్రోపాధ్యాయులకు ప్రసాదాలను పంచిపెట్టి ఆనందంగా గడిపారు. ఏర్పాటు చేసిన భోగిమంటలు ఆకట్టుకున్నాయి. అనంతరం డైట్ ఆవరణంలో కోలాటాలు, కర్రబిళ్ల, కర్రసాము, నాలుగు స్తంబాల ఆట, గోళీలాట, బొంగరాలు, వైకుంఠపాళి వంటి ఆటలను చూపరులను ఎంతో ఆకట్టుకున్నారు. అలాగే ఓ విద్యార్థిని ప్రిన్సిపాల్‌కు శోది చెప్పడం ఆకట్టుకుంది. అదే విధంగా సంక్రాంతి సాంప్రదాయ ప్రకారం గోపూజ నిర్వహించారు. తెలుగు దనాన్ని ఉటిపడేలా తెలుగు, తమిళం ఛత్రోపాధ్యాయులు కలసి ఆడుకోవడం చూసిన ప్రిన్సిపాల్ ఇలాంటి అహల్లాద కరమైన వాతావరణంలో విద్యనభ్యసించడం, పిల్లలయొక్క అదృ ష్టమని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుబ్ర మణ్యం, అధ్యాపకులు దేవప్రసాద్, చెంగల్రాజు, రెడ్డివెంకట రమణ, నాగరాజునాయక్, శ్రీనివాసులు, ప్రభాకర్, వ హమ దఫీ,నిర్మల,సునీత,అనీత, అలాగే కార్యాలయ సిబ్బంది. పలువురు పాల్గొన్నారు.

ద్రవిడ వర్సిటీలో..

ప్రజాశక్తి-గుడుపల్లి: ద్రవిడ విశ్వవిద్యాలయంలో అమ్మవారి గుడిలో సంక్రాంత్రి సంబరాలు నిర్వహించారు. విశ్వవిద్యా లయం తమిళ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఘనంగా పొంగళ్లు చేశారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.మధుజ్యోతి, రెక్టార్ ప్రొఫెసర్ అనురాధ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏకే.వేణుగోపాల్ రెడ్డి, అకాడమిక్ డిన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలపై కఠినంగా వ్యవహరించాలి

- మండల సమావేశంలో సభ్యుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ప్రజాశక్తి-వికోట: మండలంలో కల్తీ విత్తనాలు విక్రయాలపై సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ యువరాజ్ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. మండల అధికారులు వారి శాఖలకు సంబందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును సభలో వివరించారు. ఇటీవల మండలంలో నకిలీ విత్తనాలు విక్రయాలు జరగడం పట్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాటి విక్రవాయాలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని సభ్యులు డిమాండ్ చేశారు. దరఖాస్తు పట్టా భూములుగా మార్చే ప్రక్రియకు లబ్ధిదారులు సహకరించే విధంగా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని తహశీల్దార్ చిట్టిబాబు కోరారు. మండల పరిధిలో చేపట్టిన సిమెంట్ రోడ్డు భవనాల నిర్మాణాలను పూర్తి చేసి బిల్లులకు సిద్ధం చేయాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలాగురునాథ్, వైస్ ఎంపీపీలు లక్ష్మణ్‌రెడ్డి, తమిమ్‌ఖాన్, జెడ్పీ ప్రత్యేక ఆహ్వానితులు గౌస్, సింగల్ విండో ఛైర్మన్ శ్రీరాములురెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ, సామజిక సలహాదారు అమర్నాథ్, ఎంపీడీఓ మహమ్మద్ రఫీ, సిఐ లింగప్ప, మండల ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పనులు ఉన్నట్టా.. లేనట్టా..?

ప్రజాశక్తి-సోమల: ఉపాధి పథకం ద్వారా పేదలకు క్షేత్ర స్థాయిలో పనులు కల్పించారా.. లేదా అన్న విషయాలను సోషల్ ఆడిట్ బృందం క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. 2022-23ఆర్థిక ఏడాధికి గానూ మండలంలో చేపట్టిన పనులపై ఆడిట్ బృందం గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గత మూడు రోజులుగా ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీల సభ్యులు రైతు పొలాలు, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై పరిశీలిస్తున్నారు.



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఆడిట్ బృందం

గుట్టలు, వాగులు ఏమీ మిగల్చరా.?

- భూ ఆక్రమణలపై టీడీపీ, జనసేన నేతల ఆందోళన

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలో రోజురోజుకూ భూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయని టీడీపీ, జనసేన నాయకులు ఆందోళన చేపట్టారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సంఘ అధ్యక్షులు బట్టి చాణిక్యప్రతాప్ మాట్లాడుతూ మండలంలోని ఆడవులు, గుట్టలు, వాగులు ఇష్టానుసారంగా ఆక్రమణలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సి రెవెన్యూ అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి జేబులు నింపుకొని విన్నకుండి పోతున్నారని ఆరోపించారు. వెదురుకుప్పంలో 66ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు మంజూరు చేశారని, ఎవరెవరికి ఎక్కడ ఇచ్చారనే స్పష్టత లేదని, పట్టాల పంపిణీలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు చెప్పారు. అధికారులు ఇప్పటికైనా స్పష్టమైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి పేదలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండలంలో వివిద చోట్ల భూ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు చొరవ తీసు కొని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.



ఆందోళన చేపడుతున్న నాయకులు

'ఆదరించి ఆశీర్వదించారు.. అందుకే సేవ'



చికిత్స చేయించుకున్న వృద్ధులను పలకరిస్తున్న మంత్రి

ప్రజాశక్తి-నగరి: ప్రజలు ఓటుతో ఆశీర్వదించినందునే మంత్రిగా ఉన్నానని, అందుకే సేవచేసే అవకాశం వచ్చిందని మంత్రి ఆర్కేరోజా అన్నారు. శనివారం తన క్యాంప్ కార్యాలయం వద్ద నేత్ర వైద్య శిబిరంలో కంటి ఆపరేషన్లు చేసుకున్న వారిని పేరుపేరునా పలకరించారు. ఇక కంటి చూపునకు ఇబ్బంది ఉండదని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఉచిత ఆపరేషన్ చేసుకున్న అవ్వతాతలు బావోద్వేగానికి లోనైయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న వైద్యశిబిరంలో 520 మందికి ఇప్పటి వరకు పరీక్షలు నిర్వహించగా 120మందిని ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేశారని వారిలో కంటి పొర సమస్య ఉన్న 58 మందికి చికిత్స జరిగిన ప్రాంతంలోనే శంకరనేత్రాలయకు చెందిన ప్రఖ్యాత కంటివైద్య నిపుణులు శంకర్, గజేంద్ర నొప్పి లేకుండా, కుట్లు లేకుండా అత్యాధునిక పద్ధతిలో రెండు గంటల వ్యవధిలోనే ఆపరేషన్ చేయడం జరిగిందన్నారు. ఐవోఎల్ లెన్స్, కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందించారు. మధ్యాహ్నం అందరికీ మంత్రి నివాసం వద్దే భోజన సౌకర్యం కల్పించారు.

'రోబోటిక్స్' పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: వేలూరు విట్ కళాశాలలో నిర్వహించిన రోబోటిక్స్-2024లో చిత్తూరు బృందావన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వివిద రాష్ట్రాల నుంచి 2వేల మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి పాల్గొనగా వర్కింగ్ మోడల్ పోటీలో సరికొత్త ప్రెజెంటేషన్ చేసిన వారిలో 5మంది బృందావన్ విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలకు చెందిన ఉజ్వలేశ్వర్, దర్శన్‌చౌదరి, వినీల్, సూర్యనారాయణ విజేతలుగా నిలిచారు. వీరిని బృందావన్ యాజమాన్యం అభినందించింది.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

జగన్ మాట ఇచ్చాడు.. పింఛన్ పెంచాడు : డిప్యూటీ సీఎం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: పేదల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ తపిస్తూనే ఉంటాడని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శనివారం జీడీ నెల్లూరు నియోజకవర్గం పాలసముద్రం మండలంలో పెంచిన రూ.3వేల పింఛన్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తున్నట్లు చెప్పారు.

గంగవరం: గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పెంచిన రూ.3వేల పింఛన్ కానుకను పంపిణీ చేశారు.

కార్వేటినగరం: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డిని మరోసారి సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీరాజపేట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చిన్న, ఎంపీటీసీ మురగయ్య ఆధ్వర్యంలో శనివారం నూతన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ మోహన్, జేజేలురెడ్డి, మాసలామణి, కార్యదర్శి కుప్పు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: కొత్తగా మంజూరైన పింఛన్‌లను ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ చేతుల మీదుగా శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.3వేలకు పెంచి పింఛన్ అందజేస్తున్నట్లు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అగస్తి పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. డిసిసిబి ఛైర్మన్ రెడ్డెమ్మ, జెడ్పీటీసీ కేశవులు, కన్వీనర్ కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖజానా నింపుకోవడమా అభివృద్ధి అంటే..

- గ్రామాల పర్యటనలో వైసీపీని ప్రశ్నించిన టీడీపీ నేత చల్లా రామచంద్రారెడ్డి



పుంగనూరు పర్యటనలో చల్లా రామచంద్రారెడ్డి



బైరెడ్డిపల్లిలో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి



బంగారుపాళ్యం: గ్రామాల పర్యటనలో డాక్టర్ మురళిమోహన్

ప్రజాశక్తి-పుంగనూరు: ఏళ్ల తరబడి నియోజకవర్గంలో అధికారాన్ని అనుభవిస్తూ సొంత ఖజానా నింపుకోవడాన్ని అభివృద్ధి అంటారా అని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డి వైసీపీ నేతలను ప్రశ్నించారు. శనివారం మండలంలోని మాగండ్లపల్లి, ఏటవాకిలి పంచాయతీలలో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చెబుతున్న అభివృద్ధి ప్రగల్భాలకే పరిమితమైందన్నారు. క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో ఎక్కడివేసిన గొంగలి అక్కడే అన్న చందంగా అభివృద్ధి ఆగిపోయిందన్నారు. పల్లెల్లో తిరిగితే వారు చేసిన అభివృద్ధి ఎంటో అర్థమవుతుందన్నారు. ఏవైనా రోడ్లు వేశారంటే అది వారి సొంత ఖజానా నింపుకోవడానికి కోసం మాత్రమేనని విమర్శించారు. బర్నేపల్లి గ్రామంలో రోడ్లపైకి మురుగు నీరు ప్రవహిస్తోందని, అధికారులు, పాలకులకు ఈ ఇబ్బందుకు పట్టవా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. అభివృద్ధి జరగాలంటే టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపీని ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు మాధవరెడ్డి, మోహన్‌నాయుడు, రెడ్డెప్పనాయుడు, సీపీ.రెడ్డి, రాష్ట్ర బీసీ సంఘ నేత శ్రీకాంత్, పోలీస్ గిరి, ఆసూరి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణాన్ని అమలు చేయనున్నట్లు పూతలపట్టు టీడీపీ ఇన్‌ఛార్జ్ మురళీమోహన్ అన్నారు. శనివారం మండలంలోని తుంబకుప్పం గ్రామంలో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు యువత అధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మురళిమోహన్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్, మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు, నాయకులు గిరిబాబు, రాధాకృష్ణ, ధరణి, వంశీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిత్తూరు పార్లమెంటరీ టీడీపీ అధికార ప్రతినిధి కొత్తపల్లి రమేష్‌ని జీడీ నెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ థామస్ పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ గంధమనేని జయశంకర్‌నాయుడు, నాయకులు గుండయ్య, దాము, స్వామిదాస్, శ్రీధర్‌యాదవ్, చంద్రబాబు, గురునాథం, గుణశేఖర్, జీవన్, సతీష్, లోకేష్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని వివిద గ్రామ పంచాయతీలలో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. బైరెడ్డిపల్లి, ధర్మపురి, గంగినాయనపల్లి పంచాయతీలలో ఆయన పర్యటించి ఓటర్లను అభ్యర్థించారు. గంగినాయనపల్లి పరిధిలో ఉన్నపిచ్చి గుండ్లపల్లి గ్రామంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి మాజీ మంత్రి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వార్డ్ సభ్యుడు దేవరాజులు, భాగ్యలక్ష్మి, జయచంద్ర, పెట్టెప్ప, ధనంజయ, కిషోర్, చంద్రప్ప, నాగప్ప, బాస్కర్, గణేష్, మోహన్, చంద్రమ్మ, శారద, రెడెప్ప తదితరులు ఉన్నారు.

నగరి: రూరల్ మండలం తెరణి గ్రామపంచాయతీకి చెందిన పలువురు వైసిపి నాయకులు పెరియ స్వామి, ఎలుమలై, సుందర్, శ్రీనివాసన్‌తో పాటు పలువురు టీడీపీలో చేరారు. శనివారం నగరి టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి గాలి భాను కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

క్రైం కార్నర్

బైక్ ప్రమాదం.. యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు గాయాలపాలైన సంఘటన శనివారం మండలంలోని బైరెడ్డిపల్లి-పుంగనూరు రహదారిలో చోటుచేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. కొత్తఇండ్లుకి చెందిన యువకుడు మురళి(28) స్వగ్రామం నుంచి బైరెడ్డిపల్లికి వెళుతుండగా గంగినాయనపల్లి వద్ద బైక్ అదుపు తప్పింది. దీంతో రోడ్డు పక్కడ బైక్ బోల్తాపడింది. గుర్తించిన స్థానికులు తీవ్ర గాయాలతో ఉన్న మురళిని 108లో ఆసుపత్రికి తరలించారు.

బహుమతుల అందజేత



బహుమతులు అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపోలో కొత్తగా ప్రవేశపెట్టిన గిఫ్ట్ స్కీములో ఎంపికైన వారికి శనివారం డిపో మేనేజర్ సుధాకర్ బహుమతులు అందజేశారు. డిపో ఆవరణంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ పుంగనూరు-రాయచోటి, పుంగనూరు-ములభాగల్, పుంగనూరు-దొడ్డిపల్లి-తిరుపతి రూట్లులలో ప్రవేశపెట్టిన గిఫ్ట్ స్కీం నందు డిసెంబర్ 16 నుండి 31 వరకు ప్రయాణించిన వారికి ఒక్కొక్క రూటులో ఇద్దరిని లక్కీ డిప్ ద్వారా ప్రథమ ద్వితీయ బహుమతులకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. బహుమతులకు ఎంపికైన వారు శంకర్‌రెడ్డి, సూర్యప్రకాష్, ఆంజనేయులు, హరినాథ్, అప్సర్‌లు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో డిపో అభివృద్ధి మండలి సభ్యులు జయరామిరెడ్డి, గ్యారేజ్ సూపర్వైజర్ రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

'భోజనం రుచిగా ఉంటోందా పిల్లలూ..?'

ప్రజాశక్తి-సోమల: పిల్లలూ మధ్యాహ్నం నాణ్యమైన భోజనం పెడుతున్నారా..? రుచిగా ఉంటోందా..? ఇబ్బందులు ఉంటే చెప్పండి అని సామాజిక తనిఖీ బృందం పాఠశాల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శనివారం మండలంలోని ఇరికిపెంట ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల నడవడిక, చదువులో వారి సామర్థ్యాన్ని ప్రశ్నలు వేసి సమాదానాలు రాబట్టారు. అదేవిధంగా మండలంలోని వడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈవో శివరత్నమ్మ తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఫొటోగ్రాఫర్ల భవన నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-నగరి: జ్ఞాపకాలకు చెరగని ముద్ర వేసేది ఫొటోగ్రాఫర్లే అని మంత్రి ఆర్కే రోజా అన్నారు. శనివారం నగరి పట్టణం మునీశ్వర ఆలయం సమీపం ఎంపీ నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించే నగరి ఫోటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తీపి జ్ఞాపకాలకు చెరగని ముద్ర వేసేది ఫోటో, వీడియో గ్రాఫర్లే అన్నారు. అరుదుగా అందమైన దృష్యాలను నిరంతరం చూసుకునేలా చేసేది ఫోటో, వీడియోలే అన్నారు. ఫోటోగ్రఫీకి ఉన్న వాల్యూ, వీడియో టెక్నాలజీ ఎంత పెరిగినా వాటికున్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదన్నారు. అలాంటి ఫోటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘ భవనానికి భూమి పూజ చేయడం ఆనందాన్ని ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు శివశంకర్, కౌన్సిలర్లు దయానిధి, గోపాల్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, ఇంద్రారెడ్డి, నాయకులు సలీం, చిన్నదొరై, నగరి పుత్తూరు ఫోటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గోదారమ్మ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని అన్నూరు గ్రామానికి చెందిన సింగిల్విండో అధ్యక్షుడు వి.లోకనాథరెడ్డి తల్లి గోదారమ్మ(85) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి గ్రామానికి వెళ్లి గోదావరమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ లతబాలాజీ, పార్టీ మండల కన్వీనర్ శేఖర్రాజు, మాజీ కన్వీనర్ ధనంజయవర్మలు, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, లోకనాధనాయుడు డిప్యూటీ సీఎం వెంట ఉన్నారు.

'గాలికుంటు'కు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి-సోమల: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పకుండా వేయించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ ఏడి శ్రీనివాసులునాయుడు అన్నారు. శనివారం స్థానిక పశు వైద్యశాలలో మండలంలోని సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గాలికుంటు వ్యాధి సోకడం వల్ల పశువులు జీవితకాలం అనారోగ్యంతో బాధపడతాయని, పాల దిగుబడి తగ్గుతాయని వెంట్రుకలు నిక్కబడుచుకొని ఉంటాయని గసపోస్తూ ఉంటాయన్నారు. ఈ సమస్యలతో పశువులు జీవితకాలం ఇబ్బంది పడుతూ అనారోగ్య పరిస్థితులను ఎదుర్కొంటూ ఇబ్బంది పడతాయన్నారు. వీటి నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పక పశువులకు వేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి చందన ప్రియ పాల్గొన్నారు.

8న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించిన సీఎం యువతను మోసం చేశారని రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరశిస్తూ ఈనెల 8వ తేదీ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షులు కాజూరు రాజేష్ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ ధర్నాలో చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని యువత పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మంజు, యువరాజ్, దిలీప్, నవీన్, గౌస్ పాల్గొన్నారు.

ప్రచార రథాలు ఏర్పాటు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జయహో బీసి పేరిట చిత్తూరు పార్లమెంట్ పరిధిలో 50రోజులు పాటు బీసీల్లో చైతన్యం తీసుకొచ్చేలా జీజేఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో చంద్రబాబు స్టికర్లతో రెండు ప్రచార రథాలను ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు టిడిపి సీనియర్ నాయకులు గురజాల చెన్నకేశవ నాయుడు తెలిపారు. టీడీపీ నాయకులు పులివర్తి నాని, దొరబాబు, చంద్రప్రకాష్, కోదండయాదవ్, టీడీపీ బిసి నాయకులు వెంకటేష్‌లు శనివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రారంభించారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నాయకులు